7వ పాఠం నవంబరు 6-12

# ధర్మశాస్త్రము మరియు కృప

సబ్బాతు మధ్యాహ్నము నవంబరు 6

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : యెహెజ్కేలు 28:15,16; ద్వితీ 4:44; రోమా 3:20; ద్వితీ 10:1-15; ద్వితీ 5:6-22; 9:1-6.**

**కంఠతవచనం : "నేను దేవుని కృపను నిరర్థకము చేయను. నీతి ధర్మశాస్త్రము వలనైతే ఆ పక్షమందు క్రీస్తు చనిపోయినది నిష్ ప్రయోజనమే" (గలతి 2:21).**

క్రైస్తవ మతపరముగా వేరువేరు వర్గములకు (డినామినేషన్స్) చెందిన క్రైస్తవులు ధర్మశాస్త్రమునకు మరియు కృపకు మధ్యనున్న బాంధవ్యమును గూర్చి అర్థము చేసుకున్నారు. ధర్మశాస్త్రము దేవుని యొక్క పరిశుద్ధతను, నీతిని తెలియపర్చే ప్రమాణమువంటిది. ధర్మశాస్త్రమును మీరిన యెడల ఆ చర్యను పాపముగ పరిగణింపబడుతుంది.

"పాపము చేయు ప్రతివాడును ఆజ్ఞను అతిక్రమించును. ఆజ్ఞాతి క్రమమే పాపము" (1యోహాను 3:4). ఆ ధర్మశాస్త్రమును మనమందరము అతిక్రమించియున్నాము గనుక "లేఖనము అందరిని పాపములో బంధించెను" (గలతీ 3:22). కేవలము దేవుని యొక్క కృప మాత్రమే మనలను రక్షించగలుగును. "మీరు విశ్వాసము ద్వారా కృప చేతనే రక్షింపబడియున్నారు. ఇది మీ వలన కలిగినది కాదు దేవునివరమే" (ఎఫెసి 2:8).

అయితే ఇక్కడ ధర్మశాస్త్రములో భాగమైన ఏడవదిన సబ్బాతును గూర్చి కొంత వివరణ ఉన్నది. కాని అనేక కారణములను చూపుతూ ఎక్కువమంది క్రైస్తవులు ఇప్పటి మట్టుకు ఏడవదిన సబ్బాతును ఆచరించకుండా తిరస్కరించుటకు నిర్ణయించుకున్నారు. వారి నిర్ణయాన్ని కొన్ని కుంటిసాకులను చూపిస్తూ సమర్థించుకుంటున్నారు. అయితే ఇదంతా వేరొక అంశమునకు చెందిన విషయము.

అనేక నేపథ్యములలో ధర్మశాస్త్రమును గురించి వివరించినను ధర్మశాస్త్రము మరియు కృపకు సంబంధించిన ఇతివృత్తము (ప్రధానాంశము) ద్వితియోపదేశకాండముతో సహా బైబిలంతటిలో కనిపిస్తున్నది. అవును ఒక ప్రత్యేకమైన సందర్భములో ధర్మశాస్త్రమునకు మరియు కృపకు మధ్యనున్న బాంధవ్యమును ద్వితియోపదేశకాండములో వివరించబడినది.

– నవంబరు 13, సబ్బాతు దినమున ఈ పాఠమును అధ్యయనము చేయుటకు సిద్ధపడుడి.

ఆదివారం నవంబరు 7

## పరలోకములో ధర్మశాస్త్రము

దేవుడు ప్రేమగల దేవుడు. ప్రేమ దేవుని రాజ్యపాలనకు పునాది. దేవుని యొక్క స్వభావముపై ప్రేమ అల్లుకొనియుంటుంది. ఆయన ప్రేమైయున్నాడు కనుక మనము కూడా ఆయనను ప్రేమించవలెననియు, ఆయన యెడల మన ప్రేమను చూపించుటకు మనలను వివేకవంతులుగా సృష్టించి నీతి ప్రథమగు స్వేచ్ఛను మనకు అనుగ్రహించెను. మరియు ప్రేమలో స్వేచ్ఛ సహజ సిద్ధముగా ఉండేటట్లు మనలను నిర్మించెను.

నీతిప్రథమైన స్వేచ్ఛా భావము నీతిధర్మశాస్త్రములో కేంద్రముగా ఉన్నది. జంతువులు, సముద్ర తరంగములవంటివి. కొంతమేర ప్రకృతి సూత్రములననుసరించి ప్రవర్తించినను అవి నీతి ధర్మశాస్త్రమును అనుసరించవు లేక వాటికి దాని యొక్క అవసరము కూడా ఉండదు. కేవలము నీతిని అనుసరించి జీవించగలిగే మానవులకు నీతి ధర్మశాస్త్రము అవసరమైయున్నది. అందుచేతనే పరలోకములో ఉన్న దూతలకొరకు నీతి ధర్మశాస్త్రమును దేవుడు పరలోకములో కూడా అనుగ్రహించెను.

**యెహెజ్కేలు 28:15, 16 చదువుడి. పరలోకములో లూసిఫర్ యొక్క పతనమును గూర్చి ఈ వాక్యములు మాట్లాడుచున్నవి లూసిఫర్‌లో "పాపము" కనబడెను, మరియు అతడు పాపము చేయుచు వచ్చెను. పరలోకములో జరిగిన సంఘటనకు సంబంధించి పరలోకములో నీతిధర్మశాస్త్రము ఉనికిలో ఉన్నదని ఏ మాటలు తెలియపర్చుచున్నవి?**

మానవులమైన మన మధ్యన "పాపము" మరియు పాపము చేయుచు వచ్చెను అనే మాటలను వాడుచున్నాము. వేరే సృష్టియైన పరలోకములో కూడా అవే మాటలు ఉపయోగించినట్లు పరిశుద్ధ లేఖనాలు చెప్పుచున్నవి. దీని ప్రకారము పరలోకములోను మరియు భూమి మీద ఉనికిలో ఉన్న ఒక విషయమును గూర్చి ఇది మనకు తెలియజేయుచున్నది.

**"కాబట్టి ఏమందుము? ధర్మశాస్త్రము పాపమాయెనా? అట్లనరాదు. ధర్మశాస్త్రము వలననే గాని పాపము ఎట్టిదో నాకు తెలియకపోవును. ఆశింపవద్దని ధర్మశాస్త్రము చెప్పనియెడల దురాశయన ఎట్టిదో నాకు తెలియకపోవును" (రోమా 7:7). నీతిని అనుసరించగలిగే దేవతలున్న పరలోకములో కూడా అదే భావము ఏవిధముగా వ్యక్తపర్చబడెను?**

దేవుని పరిశుద్ధ చట్టములో దేవుని చిత్తము తెలియజేయబడుతుంది. ఈ చట్టములో ఉన్న నియమములే పరలోకములో ఉన్న చట్టములో కూడా ఉన్నవి. దేవుని చిత్తమును

తెలుసుకొనుటకన్నా పరలోకములో గల దేవదూతలు తెలుసుకోవలసినది అంతకన్నా మించిన మరియు అంతటి జ్ఞానము వారికి లేదు. వారికున్న శక్తితో దేవుని చిత్తమును నెరవేర్చుటయే వారు చేయగలిగిన అత్యున్నతమైన సేవ థాట్స్ ఫ్రమ్ మౌంట్ ఆఫ్ బ్లెస్సింగ్స్, పుట 109.

పరలోకము లేక భూమి అనే తేడా ఏమియులేదు. నీతిననుసరించి జీవించగలిగే మనుష్యులు మరియు దేవతూలున్నప్పుడు, వారిని పరిపాలించుటకు దేవునికి ఒక నీతి ధర్మశాస్త్రము ఉంటుంది. అది పరలోకములోనైనా లేక భూమి మీదనైనా నీతి ధర్మశాస్త్రమును మీరిన యెడల అది పాపము అవుతుంది.

**నీతిని అనుసరించి జీవించే మనుష్యుల నుండి నీతిధర్మశాస్త్రమును ఎందువలన వేరు చేసి చూడలేము? ధర్మశాస్త్రము లేనియెడల ఏది నీతి మరియు ఏది పాపము అని ఎట్లు వివరించగలము?**

**సోమవారం** **నవంబరు 8**

## ద్వితీయోపదేశకాండములో ధర్మశాస్త్రము

దేవుడు తాను ఎన్నిక చేసుకొనిన ఇశ్రాయేలు ప్రజలు, ఆయన వారికి వాగ్దానము చేసిన కానాను దేశమును స్వతంత్రించుకొనుట దాని సరిహద్దుల యొద్దకు చేరియున్నారు. ఇక్కడ మనము ద్వితీయోపదేశకాండములో చూచినట్లుగా ఇశ్రాయేలు ప్రజలు కానానును స్వతంత్రించుకొనకముందు వారినుద్దేశించి మోషే తన చివరి ఉపదేశమును బోధించుచున్నాడు. ఆయన చేసిన ఉపదేశములలో వారు గైకొని విధేయత చూపించవలసిన కొన్ని ఆజ్ఞలున్నవి.

**ఈ వాక్యాలను చదవండి. అనేకమార్లు ఏవిషయాన్ని గూర్చి వారికి చెప్పెను? ఆ విషయము ఇశ్రాయేలు ప్రజలకు ఎందువలన ప్రాముఖ్యమైనది? (ద్వితీ 4:44; 17:19; 28:58; ద్వితీ 30:10; 31:12; 32:46; 33:2).**

ద్వితీయోపదేశకాండమును మనము పైపైన ఎన్నిసార్లు చదివినను, ధర్మశాస్త్రమునకు విధేయత చూపుట అనునది ఇశ్రాయేలీయులకు ఎంత ప్రాముఖ్యమో అది తెలియజేయుచున్నది. నిజముగా చెప్పాలంటే అది వారు నెరవేర్చవలసిన నిబంధన విధులను గూర్చి చెప్పుచున్నది. ఇశ్రాయేలు ప్రజలు వారంతట వారు సాధించుకొనలేని అనేక విషయాలను దేవుడు వారికి అనుగ్రహించెను మరియు వారు పొందిన కొన్ని దీవెనలకు అర్హులు కాకపోయినను దేవుడు తాను చేసిన నిబంధనను బట్టి వారి యెడల తన కృపను అపారముగా చూపించాలని ఆయన కోరియున్నాడు.

ఇప్పుడు కూడా ఆ విషయములో ఎటువంటి తేడా లేదు. ధర్మశాస్త్ర క్రియలను

బట్టి కాక దేవుని యొక్క కృప మనలను రక్షించును.

"కాగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలు లేకుండ విశ్వాసము వలననే మనుష్యులు నీతిమంతులుగా తీర్చబడుచున్నారని యెంచుచున్నాము" (రోమా 3:28). మరియు దానికి ప్రతిస్పందనగా ధర్మశాస్త్రమునకు మనము విధేయత చూపించవలసిందే. మనము రక్షింపబడుటకు ధర్మశాస్త్రమును గైకొనుట లేదు గాని, దానిని గైకొనుట ద్వారా మనకు పాపమంటే ఏమిటో తెలియబడుచున్నది (రోమా 3:20) "మీరు నన్ను ప్రేమించినయెడల నా ఆజ్ఞలు గైకొందురు" (యోహాను 14:15) అని యేసు చెప్పుచున్నాడు.

కృప మరియు ధర్మశాస్త్రమునకు సంబంధించి ద్వితియోపదేశకాండమును ఒక పెద్ద ఉపమాన పాఠముగా చూడవచ్చును. మనంతట మనము మన కొరకు సంపాదించుకొనలేని విమోచనమును దేవుడు తన కృప ద్వారా మనలను విమోచిస్తున్నాడు. (ఇశ్రాయేలీయులు వారంతటవారు ఐగుప్తు నుండి విమోచించుకొనలేకపోయినారు). దానికి ప్రతిస్పందనగా దేవునికి మరియు ఆయన ధర్మశాస్త్రమునకు విధేయత చూపిస్తూ విశ్వాసము ద్వారా జీవిస్తాము. ఆదాము పాపములో పడిపోయినది మొదలుకొని, శ్రమకాలములోను, మృగము యొక్క ముద్ర కాలములోను కూడా, దేవుని ఆజ్ఞలను యేసును గూర్చిన విశ్వాసము కలిగిన ప్రజలు (ప్రకటన 14:12) ఉన్నారు. దేవుని నిబంధన ప్రజలతో ఆయనకున్న బాంధవ్యము ధర్మశాస్త్రము మరియు కృప వలన ఏర్పడుచున్నది. దేవుని ధర్మశాస్త్రమును మీరినందుకు దేవుని కృప మనలను క్షమించును. మరియు నిబంధన బాంధవ్యము ద్వారా వచ్చే విధేయత అనగా ధర్మశాస్త్రమునకు విధేయత చూపించుటకు కూడా దేవుని యొక్క కృపే మనకు సమర్థతను కలుగజేయును.

**మనము ధర్మశాస్త్రమునకు విధేయత చూపునప్పుడు రక్షింపబడే హక్కు పొందటమనే బోనులో పడకుండా ఏవిధముగా తప్పించుకొనగలము?**

మంగళవారం నవంబరు 9

## లెటూవ్‌లక్ (నీ మేలు కొరకే)

సందేహములతో బైబిలు గ్రంథమును తిరస్కరించాలని కోరుకునే వారు పాత నిబంధన గ్రంథములో కనిపించే కొన్ని కఠినమైన మాటలను చూపిస్తారు. అనగా పాతనిబంధన గ్రంథములో కనిపించే దేవుడు కఠినముగాను, కక్ష సాధించే వానిగాను, నీచమైన మనస్తత్వము కలిగిన వాని గాను చిత్రీకరిస్తారు. ఈ లక్షణాలు యేసుకు విరుద్ధమైనవని భావిస్తారు. ఇదేదో క్రొత్తగా వచ్చిన వాదము కాదు. ఎన్నో శతాబ్దముల నుండి వస్తున్న దురాలోచనయిది.

పాతనిబంధన గ్రంథము ప్రకారము ప్రభువైన దేవుడు పురాతన ఇశ్రాయేలు ప్రజలను

ఎక్కువగా ప్రేమించి వారికే అత్యున్నతమైన దీవెనలను అనుగ్రహించాడని చెప్పేవారున్నారు. ద్వితియోపదేశకాండములో దేవుని ప్రేమ చాలా బలముగా వివరించబడినది.

**ద్వితి 10:1-15 చదువుడి. ఈ వాక్యములు ఏ సందర్భమును బట్టి మాట్లాడుచున్నవి? తన ప్రజలైన ఇశ్రాయేలీయులు పాపము చేసినా, వారి యెడల ఆయన ప్రేమను కనుపర్చుచునే యున్నాడు. కృపను గూర్చి మనకేమి బోధిస్తున్నారు?**

ఈ వాక్యముల ద్వారా ఇశ్రాయేలీయుల యెడల దేవుని యొక్క ప్రేమ మరియు ఆయన కృపను గూర్చి తెలియజేయబడుచున్నది. 12 మరియు 13 వచనాలను జాగ్రత్తగా పరిశీలిస్తే ఈ రెండు వచనాలు ఒక పొడవైన వాక్యము. అందులో సామాన్యమైన ప్రశ్న ఒకటి కనిపిస్తుంది. “నీ మేలు కొరకు నేను నేడు నీకాజ్ఞాపించు యెహోవా ఆజ్ఞలను, కట్టడలను అనుసరించి నడచుకొందువని మాట కాక నీ దేవుడైన యెహోవా నిన్ను మరి ఏమి అడుగుచున్నాడు” (13వ వచనము).

హీబ్రూ భాషలో “మీరు” మరియు “మీ యొక్క” అనే పదములు ఏకవచనమును సూచించుచున్నవి. దేవుడు మొత్తము ఇశ్రాయేలు జనాంగము అంతటితో మాట్లాడుచున్నను వ్యక్తిగతముగా ఒక్కొక్క మనిషి విధేయత చూపకపోయినయెడల ఏమి ప్రయోజనము? అందుచేత దేవుడు ఇశ్రాయేలు ప్రజలతో ఒక్కొక్కరితో మాట్లాడుచున్నాడు.

13వ వచనము యొక్క చివరి భాగమును మనము మరచిపోకూడదు. ఈ విషయాలను లెటావ్‌లక్ (నీ మేలు కొరకే) అనుసరించు అనే భావము కన్పిస్తున్నది. ఇశ్రాయేలు ప్రజలు వారి మేలు కొరకే దేవునికి విధేయత చూపించాలని ఆయన ఆజ్ఞాపించుచున్నాడు. దేవుడు వారిని సృష్టించాడు. వారిని కాపాడుచున్నాడు. వారికేమి కావాలో ఆయనకు బాగుగా తెలుసు మరియు వారికి మేలైనది ఇవ్వడానికి ఆయన సిద్ధముగా ఉన్నాడు. దేవుని ధర్మశాస్త్రమునకు, ఆయన పది ఆజ్ఞలకు వారి మేలు కొరకే విధేయత చూపించాలి.

ధర్మశాస్త్రము సాధారణముగా ఒక కంచెకు, సంరక్షించే ఒక గోడకు పోల్చబడుచున్నది. అందుచేత వారు వారి మేలు కొరకు ఆ కంచెలోపల, ఆ గోడలోపలే ఉండాలి. కాని యెడల వారు నాశనము చేయబడుదురని చెప్పెను.

**దేవుని యొక్క ధర్మశాస్త్రమునకు విధేయత చూపించుట “మనమేలు కొరకే” అనే భావమును ఏ మార్గముల ద్వారా చూడగలము?**

**బుధవారం** **నవంబరు 10**

## ఐగుప్తులో ఒక బానిస

ఐగుప్తు దేశము నుండి ఇశ్రాయేలు ప్రజలను యెహోవా దేవుడు విమోచించియున్నాడు అనే అంశము ద్వితియోపదేశకాండములో అనేకసార్లు కన్పిస్తున్నది. దేవుడు వారి యెడల

చేసిన కార్యమును వారికి మరలా మరలా గుర్తు చేయబడినది. "అప్పుడు యెహోవా బాహు బలము వలనను, చాపిన చేతి వలనను, మహా భయము వలనను, సూచక క్రియల వలనను, మహత్కార్యముల వలనను ఐగుప్తులో నుండి మనలను రప్పించెను" (ద్వితి 26:8). ద్వితి 16:1-6 కూడా చూడుడి.

దేవుడు తన బాహు బలము వలనను, తన కృపను బట్టి ఐగుప్తు బానిసత్వము నుండి మరియు వారు పెట్టిన హింస నుండి ఇశ్రాయేలీయుల యొక్క నిర్గమము సంభవించినదనే వాస్తవమును పాతనిబంధన గ్రంథమునందంతట వ్రాయబడెను. "ఐగుప్తుదేశములో నుండి నేను మిమ్మును రప్పించితిని. దాస్య గృహములో నుండి మిమ్మును విమోచించితిని" (మీకా 6:4).

క్రీస్తునందున్న విశ్వాసము ద్వారా రక్షించబడుచున్నాము అని చెప్పుటకు ఐగుప్తు నుండి ఇశ్రాయేలీయుల నిర్గమము ఒక గొప్ప శక్తివంతమైన చిహ్నముగా నిలిచియుందని నూతన నిబంధనలో కూడా వ్రాయబడింది.

"విశ్వాసమును బట్టి వారు పొడినేల మీద నడిచినట్లు ఎఱ్ఱ సముద్రములోబడి నడిచిపోయిరి. ఐగుప్తీయులు ఆలాగు చేయజూచి మునిగి పోయిరి" (హెబ్రీ 11:29; 1కొరింథి 10:1-4 కూడా చూడుడి.

**ద్వితి 5:6-22 చదువుడి. యెహోవా దేవునితో ఇశ్రాయేలీయులు చేసుకున్న నిబంధనకు పునాదియైన ధర్మశాస్త్రము అనగా పది ఆజ్ఞలను మోషే వారికి వినిపిస్తాడు. ముఖ్యముగా 4వ ఆజ్ఞ మరియు దానికి గల కారణమును ఇక్కడ చూపాడు. ధర్మశాస్త్రము మరియు కృపను గూర్చిన యదార్థత విషయమై ఏమి చెప్పబడినది?**

ఏడవ దిన సబ్బాతున విశ్రమించాలి అని చెప్పే ప్రధానమైన ఆజ్ఞను గూర్చి మోషే నొక్కి చెప్పుచున్నాడు. నిర్గమము సమయములో రాతి పలకల మీద ఆజ్ఞలు వ్రాసి వారికివ్వబడినా మోషే ఇప్పుడు వాటిని మరింత వివరముగా విడమర్చి చెప్పుచున్నాడు. సబ్బాతు దినమును సృష్టికి జ్ఞాపకార్థముగానే కాకుండా, ఐగుప్తు నుండి వారు పొందిన విమోచనమునకు కూడా జ్ఞాపకార్థముగా ఆచరించాలని గుర్తు చేస్తున్నాడు. ఐగుప్తు దేశమునుండి వారిని దేవుని యొక్క కృప రక్షించి విశ్రాంతి దినమున వారి పనులనుండి విశ్రాంతిని అనుగ్రహించెను (హెబ్రీ 4:1-5). దేవుడు వారికి అనుగ్రహించిన కృపకు, ప్రత్యుత్తరముగా వారు ఇతరులకు ఆ కృపను అందించవలసియుంది.

ఆవిధముగా చూచినపుడు ఏడవదిన సబ్బాతు సృష్టికి ఒక బలమైన చిహ్నమే కాక అది విమోచన మరియు కృపకు కూడా ఒక శక్తివంతమైన చిహ్నమైయున్నది. ఆ దినమున

గృహములో జీవించుచున్న తల్లిదండ్రులు, పిల్లలే కాక ఆ గృహమునకు చెందిన సేవకులు, పశువులు చివరికి వారి మధ్యనున్న పరదేశులు సహా విశ్రమించవలసియున్నది. ఇశ్రాయేలీయులకు అనుగ్రహించబడిన కృపను, వారు ఇతరులకు కూడా అందించవలసి యున్నారు. నిబంధనకు వెలుపల ఉన్న ఇతర ప్రజలకు కూడా కృపను అందించవలసిన బాధ్యత వారిపై నున్నది.

**మత్త 18:21-35 చదువుడి. ఈ ఉపమానములో ఉన్న ఏ అంశము సబ్బాతు ఆజ్ఞను గూర్చి ద్వితియోపదేశ కాండములో నొక్కి చెప్పబడింది?**

గురువారం　　　　　　　　　　　　　　　　　నవంబరు 11

## మీ నీతి కొరకు కాదు

క్రైస్తవ మతమునకు మరియు బైబిలు మతమంతటికి విశ్వాసమువలననే నీతిమంతులుగా తీర్చబడుదురు అనే గొప్ప అంశము ప్రధానమైనదిగా ఉన్నది. "లేఖనమేమి చెప్పుచున్నది? అబ్రహాము దేవుని నమ్మెను. అది అతనికి నీతిగా ఎంచబడెను" (రోమా 4:3).

ఎలెన్ జి వైట్ చాలా ప్రముఖముగా ఆ విషయాన్ని ఈవిధముగా వర్ణించారు. విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడుట అంటే ఏమిటి? మానవుడు తన స్వశక్తితో చేసుకోలేని క్రియను దేవుడు తన మహిమతో మానవునికి చేయుట అని అర్థము. మానవులలో ఏమియు లేదని వారు చూచుకొనగలిగినప్పుడు క్రీస్తు యొక్క నీతితో వారు కప్పబడుటకు సిద్ధపడినట్లు గ్రహించాలి -ఎలెన్ జి వైట్, నేను జీవించుచున్న విశ్వాసము, పుట 109.

దేవుడెవరై యున్నాడు? అనే ప్రశ్నను పరిశీలించినచో ఆయన ఎంత పరిశుద్ధుడో చూచినచో దానికి విరుద్ధముగా మనము ఎంత అపవిత్రులమో అనే విషయము అర్థమవుతుంది. అట్టి మనలను రక్షించుటకు ఆశ్చర్యకరమైన దేవుని కృపాకార్యము మన యెడల జరిగించవలసి యున్నది. అవును సిలువ యొద్ద ఆ విధముగానే జరిగినది. నిరపరాధియైన క్రీస్తు అపరాధులయొక్క పాపముల నిమిత్తమైన తన కృపాకార్యము నెరవేరునట్లు ఆయన మరణించెను.

**ఈ దృష్టాంతమును మనసులో పెట్టుకొని ద్వితి 9:1-6 చదువుడి. అనర్హులైన మనుష్యుల కొరకు యదార్థముగా దేవుని కృప బయలుపర్చబడినదనే విషయమును గూర్చి ఇశ్రాయేలు ప్రజలకు మోషే ఏమి చెప్పెను? ఇక్కడ సంభవించిన సంఘటన విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడుదురనే నీతిసూత్రమును ఏవిధముగా ప్రతిబింబింప చేయుచున్నది?**

రక్షణ విషయమును గూర్చి మాట్లాడుతూ ద్వితి 9:5 పేర్కొనబడినట్లు "నీ నీతియైనను లేక నీ హృదయ యదార్థతయైనను కారణము కాదని చెప్పబడిన విషయము సువార్తను గూర్చి పౌలు బోధించిన విషయములో కన్పిస్తుంది. దానికి బదులు మన క్రియలను బట్టి కాకుండా తన స్వకీయ సంకల్పమును బట్టి మరియు అనాది కాలములోనే క్రీస్తుయేసునందు మనకు అనుగ్రహింపబడిన తన కృపను బట్టి మనలను పిలిచెను" (2తిమో 1:9) మరియు తీతు 1:2 కూడా చూడుడి. ఇదంతయు కూడా "నిత్యసువార్త"ను (ప్రకటన 14:6) గూర్చి ఆయన చేసిన వాగ్దానమును బట్టి సంభవించుచున్నది. అనాదికాలములోనే ఆ వాగ్దానము చేయబడిన యెడల అది ఎన్నటికి మన క్రియలను బట్టి కాదు అని అర్థమవుతుంది. దానికి కారణమేమంటే అప్పటికింకా మనము ఉనికిలో లేము కాబట్టి మన క్రియలు మనకు సహాయపడే స్థితిలో ఉండవు.

క్లుప్తముగా మనము చూచినచో మన పొరపాట్లు, తలబిరుసుతనము ఉన్నప్పటికి నీకొరకు నీలోను ఆశ్చర్యకరమైన ఆ కార్యమును తన వాగ్దానము చొప్పున ఆయన నెరవేర్చనైయున్నాడు. మన కార్యములు మరియు విధేయత వలన రక్షింపబడము గాని, రక్షింపబడినాము కాబట్టి దానికి ఫలితముగా మనలో మంచి క్రియలు మరియు దేవుని ఆజ్ఞల యెడల విధేయత చూపించగలము.

ప్రభువు తన కృప చొప్పున నిన్ను రక్షించెను. ఆయన ఆజ్ఞలను నీ హృదయ పలకల మీద వ్రాసుకొనుట ద్వారా ఆయన ఆత్మ మిమ్ములను ఆయన ధర్మశాస్త్రమును గైకొనే సామర్థ్యము మీకు అనుగ్రహిస్తాడు.

**శుక్రవారం** **నవంబరు 12**

## అదనపు అధ్యయనము

"పరలోకములో దేవుని ధర్మశాస్త్రమునకు వ్యతిరేకముగా తిరుగుబాటు చేసిన క్రీస్తు విరోధి అనేక పన్నాగములతో తన శక్తినంతటిని ఉపయోగించి యుక్తితో మోసపూరితమైన రీతులలో దేవుని యొక్క ధర్మశాస్త్రమును నిర్వీర్యము చేయుటకు ప్రయత్నించి విఫలమయ్యాడు"–ఎలెన్ జి వైట్, రివ్యూ అండ్ హెరాల్డు నవంబరు 18, 1890.

విశ్వము రెండు ట్రిలియన్ (ట్రిలియన్ అనగా ఒకటి 18 సున్నాలుగల సంఖ్య లేక ఒక వెయ్యి మిలియన్లు లేక ఒక వెయ్యి బిలియన్సు) నక్షత్ర వీధుల వెలుగుతో ప్రకాశించుచున్నది. ఒక్కొక్క నక్షత్ర వీధిలో ఒక వంద బిలియను నక్షత్రములుంటాయి. రెండు ట్రిలియన్ నక్షత్ర వీధులలో ఒక్కొక్క నక్షత్రవీధిలో 100 బిలియన్ నక్షత్రాలచొప్పున

మొత్తం రెండు ట్రిలియన్ నక్షత్ర వీధులలో 2,00,000,000,000,000,000,000,000 నక్షత్రాలుంటాయి (2 తరువాత 23 సున్నాలు ఉన్న సంఖ్య).

ఇక్కడ మనము ఆలోచించవలసిన విషయమేమిటంటే అన్ని నక్షత్రాలు ఉనికిలో ఉన్నవి. వాటిని ఉనికిలో పెట్టిన సృష్టికర్త మరింత ఎక్కువ ఘనులైయుండాలి (వాటికి మించిన వాడైయుంటాడు) పికాసో తయారు చేసిన కళా సౌందర్యము కన్నా పికాసో గొప్పవాడైయున్నాడు.

దీనిని దృష్టిలో పెట్టుకొని ఈ క్రింది వాక్యమును గూర్చి ఆలోచించండి. "ఆదియందు వాక్యముండెను. వాక్యము దేవునియొద్ద ఉండెను. వాక్యము దేవుడైయుండెను. ఆయన ఆదియందు దేవుని యొద్ద ఉండెను. సమస్తము ఆయన మూలముగా కలిగెను. కలిగియున్నదేదియు ఆయన లేకుండా కలుగలేదు" (యోహాను 1:1-3). సృష్టింపబడినదంతయు దేవునిచేత సృష్టింపబడెను. ఆయన ఏమి చేసెను. ఆయన మానవ శిశువుగా తనను తాను ఏర్పరచుకొని, పాపరహితమైన జీవితమును జీవించి తరువాత ఆయన సిలువ మీద మరణించెను. మనకు నిత్యజీవమనే వాగ్దానమును నెరవేర్చుటకు పాపమునకు చెల్లించవలసిన అపరాధ రుసుమును తన మీద వేసుకొని మనలను పాప విముక్తులుగా చేసెను. ఇదంతయు వినిన తరువాత మానవుడు ఏమి చేయవలెను? "ఇదంతయు వినిన తరువాత తేలిన ఫలితార్థమిదే. దేవునియందు భయభక్తులు కలిగియుండి ఆయన కట్టడలననుసరించి నడచుచుండవలెను. మానవ కోటికి ఇదియే విధి" (ప్రసంగి 12:13).

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. మీ తరగతి గదిలో సోమవారం చివర అధ్యయనము చేసిన ప్రశ్నకు వెళ్ళండి. దేవుని ధర్మశాస్త్రమును (పది ఆజ్ఞలను) గైకొనువారు సాతాను పెట్టుబోనులో పడిపోకుండా ఏవిధముగా తప్పించుకొనగలరు? ధర్మశాస్త్రమునకు విధేయత చూపుట అంటే చట్టబద్ధముగా జీవించుట అని అర్థమా?
2. పది ఆజ్ఞలను మీరుట వలన కలుగు పర్యవసానములను గూర్చి నీ అనుభవము ఏమైయున్నది? దీని ద్వారా యధార్థముగా దేవుని యొక్క ప్రేమ ఏవిధముగా ప్రతిబింబిస్తుంది?
3. పరలోకమును చేరుటకు మనము చేసే ప్రయత్నాలు వ్యర్థమైనవని సిలువ మనకు ఏవిధముగా చూపిస్తుంది?